పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి

మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీకేఎస్ నాయకులు

పరిగి, ఫిబ్రవరి 3 : ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బీకేఎస్ ఆధ్వర్యంలో పరిగి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఎన్నికల సమయంలో ప్రకటించినట్లుగా రైతులకు రుణమాఫీ పూర్తి చేయాలన్నారు. రైతు లందరికీ రైతు భరోసా వెంటనే అందించాలని వారు కోరారు. కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభించి, రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో బీకేఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, మల్లయ్య, వెంకట్‌రాంరెడ్డి, సుబ్బారెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

ధారూరు, ఫిబ్రవరి 3: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రఘురాం తెలిపారు. సోమవారం బాధితులకు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్‌తో కలిసి ఫోన్లను సీఐ అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైనా మొబైల్ ఫోన్లను పోగొట్టుకుంటే ధారూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం

కులకచర్ల, ఫిబ్రవరి 3 : చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కోస్గి మొగులయ్య, ఉపాధ్యక్షుడిగా భవానీకుమార్, ప్రధాన కార్యదర్శిగా పుట్టపాటి నర్సింహులు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పండుగ నర్సింహులు, తిరుపతయ్య, వెంకటయ్య, మాసయ్య, శ్రీనివాస్, వెంకటేశ్, జగదీశ్, చౌడాపూర్ ప్రభు, భరత్, వీరాపూర్ మల్కయ్య, మందిపల్ అంబేద్కర్ యువజన సంఘాల సభ్యులు శివకుమార్, శ్రీనివాస్, రాజు, వివిధ గ్రామాల గ్రామ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

మర్పల్లి, ఫిబ్రవరి 3 :మండలంలోని పంచలింగాల్ గ్రామంలో తుమ్మలపల్లి మొగులయ్య, కర్నె శేఖర్ అనారోగ్యాలతో బాధపడుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందారు.విషయం తెలుసుకున్న ఎస్‌కేఆర్ ట్రస్ట్ చైర్మన్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి వారి అంత్యక్రియలకు ఒక్కొక్కరికి రూ.ఐదు వేల చొప్పున రూ.పదివేలు పంపించారు. సోమవారం స్థానిక మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి గ్రామ నాయకులతో కలిసి మృతుల ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు.కార్యక్రమంలో నాయకులు సురేశ్ కుమార్ యాదవ్, చంద్రశేఖర్, ధర్మారెడ్డి, లింగంగౌడ్, ఆనందంగౌడ్, తుక్కయ్య, మొగులయ్య, అంజయ్య యాదవ్, రంగారెడ్డి, సంగమేశ్ గ్రామస్తులు పాల్గొన్నారు

ధారూరు, ఫిబ్రవరి 3: క్షేత్ర స్థాయిలో భగవద్గీతను ప్రజల్లో తీసుకు వెళ్లినందుకు రిఫ్లెక్షన్ సనాతన కాంక్లేవ్ 20-25 అవార్డులను వికారాబాద్‌కు చెందిన గీతావాహిని సంస్థకు అంద జేశారు. హైదరాబాద్, నారాయణగూడలోని కేశవ మెమోరియల్ స్కూల్ లోని సనాతన కాం క్లేవ్ అవార్డులను అందజేశారు. సనాతన కాంక్లేవ్ అవార్డు ను గీతా వాహిని సంస్థ అధ్యక్షురాలు శ్రీదేవికి ప్రముఖ సినిమా మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు శ్రీదేవి,ఉపాధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి జయశ్రీ, కోశాధికారి వరలక్ష్మి, సభ్యులు మాధురి, ఝాన్సీరాణి, కరుణ, సరళ, లక్ష్మి పాల్గొన్నారు.

పరిగి: బొలేరో వాహనంపై ఎద్దులను, వాహనానికి ఎద్దులబండిని కట్టి తీసుకువెళ్తున్న అరుదైన దృశ్యం

దుద్యాల ఎంపీటీసీ స్థానాలను పెంచండి

వినతిపత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొడంగల్, ఫిబ్రవరి 3: దుద్యాల మండల పరిధిలో ఏడు ఎంపీటీసీ స్థానాలు ఏర్పాటు విడుదలైన నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు ఉంటే తెలపాలని నోటీసు జారీ చేయగా సోమవారం బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినితిపత్రాన్ని అందజేశారు. మండల పరిధిలో మొత్తంగా ఏడు ఎంపీటీసీ స్థానాలు ఏర్పడుతున్నట్లు నోటిఫికేషన్ విడుదలైంది. ఇందుకు గాను మండల పరిధిలో 7 బదులుగా 8 ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రంలో కోరారు. దూరంగా ఉన్నటువంటి తండా, గ్రామాలను కలుపుతూ ఎంపీటీసీ స్థానాలు ఏర్పడ్డాయని, ప్రజల సమ్మతి కూడా తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని ఆరోపించారు. ప్రజలకు అనువుగా, పాలనా పరంగా పూర్తి సౌలభ్యం ఉండే విధంగా ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.1)దుద్యాల, 2) హీకీంపేట, 3)లగచెర్ల, రోటిబండతండా, ఈర్లపల్లి, సంత్రకుం టతండా , 4)గౌరారం, సాగారంతండా, హంసాన్‌పల్లి, ఎక్కచెరు వుతండా, 5) కుదురుమల్ల, సగాయిపల్లి, ఆలేడు 6) చిల్‌ముల్ మైల్వార్, నాజ్‌ఖాన్‌పల్లి, సత్తర్‌కుంటతండా, చట్టుపల్లితండా 7) దుద్యాల, అల్లిఖాన్‌పల్లి 8)పోలెపల్లి మాదిరిగా ఎంపీటీసీ స్థానాలు ఏర్పాటు చేసే అందరికీ వీలుగా ఉంటుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల్ అధ్యక్షుడు చాంద్‌పాషా, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు నాయకులు మడిగె శ్రీనివాస్, నరేశ్‌గౌడ్, బస్సరెడ్డి, కవిత, శాసం వెంకటయ్య, రమేశ్, రాజూ నాయక్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు వేల గొంతులు' కు తరలిరండి

మర్పల్లిలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మర్పల్లి, ఫిబ్రవరి 3 : ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈ నెల 7న నిర్వహించనున్న లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చలో హైదరాబాద్ లక్ష డప్పులు వేల గొంతుల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్, నాయకులు దివాకర్, రతన్, శ్రీనివాస్, రమేశ్ మిత్ర, నవీన్, నగేశ్, మహిపాల్ పాల్గొన్నారు.

కులకచర్ల : లక్ష డప్పులు...వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర దళిత సంఘాల నాయకులు మందిపల్ వెంకట్, ఎమ్మార్పీఎస్ మండల కమిటి అధ్యక్షుడు మొగుళ్లపల్లి మొగులయ్య, అంబేద్కర్ యువజన సంఘాల అధ్యక్షుడు పరిగి అశోక్, ప్రధాన కార్యదర్శి కుమార్ అన్నారు. ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ ఆద్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే లక్షడప్పులు.వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి దళితుడు కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కొరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో డప్పులతో వెళ్లి తమ నిరసనను తెలియజేయాలని అన్నారు.

వ్యాపారంలో నష్టంతో భారీ దొంగతనం

- షట్టర్ పగులగొట్టి రూ.30లక్షల చోరీ..
- 24 గంటల్లో ముగ్గురు నిందితులు అరెస్ట్
- రూ.28.62వేల నగదు రికవరీ

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సర్ధార్‌సింగ్, చిత్రంలో ఇన్‌స్పెక్టర్ పరశురాం, అధికారులు

బేగంపేట్, ఫిబ్రవరి 3: బట్టల వ్యాపారంలో నష్టం రావడంతో భారీ దొంగతనానికి పాల్పడిన వివిధ రాష్ట్రాలకు చెం దిన ముగ్గురు నిందితులను సికింద్రాబాద్ మహంకాళి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.28.62వేల నగదు రికవరీ చేశారు. సోమవారం మహంకాళి ఏసీపీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్స్పెక్టర్ పరశురాంలుతో కలిసి ఏసీపీ సర్ధార్‌సింగ్ వివరాలు వెల్లడించారు. సుచి త్ర ప్రాంతంలో నివాసముంటున్న జయేశ్ పటేల్ సికింద్రాబాద్ ఓల్డ్‌బోయిగూడ ప్రాంతంలో డీప్ ఇంజినీరింగ్ వర్క్స్ కంపెనీ నిర్వహిస్తున్నాడు. అయితే జయేశ్ పటేల్.. తన పిల్లల చదువు కోసం రూ.30 లక్షల నగదును షాపులో పెట్టాడు. ఈ నెల1న గుర్తు తెలియని దుండగులు దుకాణం షట్టర్ పగులగొట్టి లాకర్‌లో ఉన్న నగదును దొంగిలించారు. మరుసటి రోజు గమనించిన జయేశ్‌పటేల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి.. సీసీ పుటేజీలు, ఫోన్‌ట్యాపింగ్, ఇతర మాధ్యమాల ద్వారా నిందితులను 28 గంటల్లో పట్టుకుని అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్‌లో మహంకాళి, మార్కెట్, రాంగోపాల్‌పేట్ పోలీసులు పాల్గొన్నారు.

బట్టల వ్యాపారంలో నష్టంరావడంతో చోరీ

మహారాష్ట్ర భీమండికి చెందిన మురళీధర్‌మోహన్(39), ఉత్తరప్రదేశ్ జౌన్‌పూర్‌కు చెందిన చంద్రభన్ పటేల్(39), ఉదయ్‌రాజ్(48)లు సికింద్రాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో బట్ట లు వ్యాపారం చేశారు. అయితే వ్యాపారంలో భారీగా నష్టాలు రావడంతో దొంగతనాన్ని ఎంచుకున్నారు. ఈక్రమంలో ఓల్డ్ బోయిగూడలో రెక్కీ నిర్వహించారు. మురళీధర్ మోహన్ డీప్ ఇంజినీరింగ్‌పై దృష్టి సారించి.. ఈ నెల 1న కంపెనీ షట్టర్ పగులగొట్టి లాకర్‌లో ఉన్న రూ.30.20 లక్షలను దొంగిలించారు. అనంత రం మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న సితార లాడ్జిలో బస చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సీసీ పుటేజీల ఆధారంగా సోమవారం సితార లాడ్జిలో ఉన్న ఈ ముగ్గురి నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.28.62లక్షల నగదును రికవరీ చేశారు.

రేపు బీఆర్ఎస్ రైతుదీక్ష

వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

నవాబుపేట, ఫిబ్రవరి 3: మండల కేంద్రంలో ఈ నెల ఐదున (బుధవారం) నిర్వహించ తలపెట్టిన రైతు దీక్షకు ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున రావాలని బీఆర్ఎస్ నవాబుపేట మండల అధ్యక్షుడు అంతమోళ్ల దయాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని వాటిపై నిరసన తెలిపేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరు కానున్నారని చెప్పారు. గత వారం రోజులుగా 32 గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి దీక్షకు సంబంధించిన విషయంపై అవగాహన కల్పించిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సలహాదారు విజయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతికుమార్, జనరల్ సెక్రటరీ మహేశ్వర్‌రెడ్డి, కోశాధికారి జగన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ మాణిక్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఆఫ్సర్‌ఖాన్, యూత్ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు

కులకచర్ల, ఫిబ్రవరి 3: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో వసంత పంచమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీదేవికి పూజలు నిర్వహించారు. విద్యార్థులు చక్కగా చదువు కొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని పాఠశాల ఎస్‌వో దేవి ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్గీకరణ జరుగక పోవడంతో అన్యాయం

కులకచర్ల, ఫిబ్రవరి 3 : ఏబీసీడీ వర్గీకరణ జరుగక మాదిగలు విద్య, ఉద్యోగ రంగాల్లో నష్టపోతున్నారని మాదిగ ఉద్యోగుల సం ఘం జిల్లా నాయకులు తుప్పలి ఆనంద్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమ వారం విలేకరులతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ధర్మాస నం ఏడుగురు జడ్జీలు ఏబీసీడీ వర్గీకరణ చేయాలని ఆదేశాలు జారీచేసినా రాష్ట్రంలో ఏబీసీడీ వర్గీకరణకు అసెంబ్లీలో తీర్మాణం చేయక పోవడం బాధాకరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేసి తీరుతామని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని అన్నారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో జరి గే లక్షడప్పుల...వేల గొంతుల కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

యాలాల, ఫిబ్రవరి 3: కాగ్నా నదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. మం డల పరిధిలోని కోకట్ సమీపంలోని కాగ్నా నదిలో ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు యాలాల పోలీసులకు సమా చారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవ డంతో వివరాలు తెలియలేదు. మూడు రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని, వయస్సు 35 నుంచి 40 సంవత్సాలాల మధ్య ఉండవచ్చని అంచనా వేశారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

నల్లకుంట అబ్బాయి-జర్మనీ అమ్మాయి

ఒక్కటయ్యారు..



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, ఫిబ్రవరి 3 : నల్లకుంట అబ్బాయి, జర్మనీ అమ్మాయి ఒక్కటయ్యా రు. ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఇరు కుటుంబాల సమక్షంలో ఇద్దరు నిరాడంబరంగా వివాహం చేసుకున్నారు. నల్లకుంట డివిజన్, విజ్ఞాన్‌పురి కాలనీకి చెందిన చలమలశెట్టి వెంకటేశ్వర రావు, భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు అవినాశ్ కార్తిక్ జాబ్‌పై 2017లో జర్మనీ వెళ్లాడు. అక్కడ బెర్లిన్‌లో ఉద్యోగం చేస్తుండగా బల్గేరియాకు చెందిన యాన్నను ప్రేమించాడు. వీరిరువురి కుటుంబాలు ఒప్పుకోవడంతో కుటుంబ సభ్యులందరి సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. ఈ నూతన జంటను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సోమవారం వారి ఇంటికి వెళ్లి ఆశీర్వదించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): నగరంలో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 1.060కిలోల గంజాయితో పాటు ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం...ధూల్‌పేటకు చెందిన వినోద్‌సింగ్ కోఠి ఇసామియా బజార్‌లోని మోహర్ బాబా సెంటర్‌లో గంజాయి విక్రయిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ బృందం నిందితుడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 1.060కిలోల గంజాయితో పాటు ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకున్న వారిలో ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్ఐ జ్యోతి, హెడ్‌కానిస్టేబుల్ లేఖాసింగ్, కానిస్టేబుళ్లు అలీమ్, కార్తిక్, శశి తదితరులు ఉన్నారు.

తక్కువ ధరకు డ్రాపింగ్ అంటూ..

ఫోన్‌తో ఉడాయించాడు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 3: ర్యాపిడో బుకింగ్ కంటే తక్కువ ధరకు డ్రాప్ చేస్తానంటూ నమ్మించి.. బైక్ మీద ఎక్కించుకుని వచ్చిన వ్యక్తి కస్టమర్‌కు చెందిన మొబైల్ ఫోన్‌తో ఉడాయించాడు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. యూపీకి చెందిన సూరజ్ మండల్ నానగ్‌రామ్‌గూడలోని ఓ నిర్మాణ సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తుంటాడు. సొంతూరికి వెళ్లి సోమవారం తెల్లవారుజామున సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో దిగాడు. అక్కడనుంచి నానక్‌రామ్‌గూడ వెళ్లేందుకు రూ.350కి ర్యాపిడో బైక్ బుక్ చేసుకున్నాడు. ర్యాపిడో డ్రైవర్ కోసం ఎదురుచూస్తున్న సూరజ్ మండల్ వద్దకు గుర్తుతెలియని వ్యక్తి యాక్టివాపై వచ్చాడు. తాను రూ.250కే నానక్‌రామ్ గూడకు తీసుకువెళ్తానని చెప్పాడు. దీంతో ముందుగా బుక్ చేసుకున్న రైడ్ క్యాన్సిల్ చేసుకుని యాక్టివా ఎక్కాడు. కొంత దూరం వెళ్లాక పెట్రోల్ పోయించుకోవాలంటూ బంక్‌లో ఆపి రూ.250 తీసుకున్నాడు. తన ఫోన్‌లో చార్జింగ్ అయిపోయిందని, లొకేషన్ పెట్టాలంటూ సూరజ్ ఫోన్ తీసుకున్నాడు. కాగా బంజారాహిల్స్‌లోని టీవీ 9 చౌరస్తావద్దకు రాగానే బైక్ పంచర్ అయిందని దిగాలని చెప్పాడు. బైక్ మీద నుంచి సూరజ్ కిందకు దిగడంతోనే ఆగంతకుడు అతడి మోటరోలా ఎడ్జ్ 50 ప్రో ఫోన్‌తో ఉడాయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LOSS OF DOCUMENT

I, VADDE VENKATESH S/o. VADDE SAYANNA R/o. H.No. 8-3-228/678/365, Karmika Nagar, Yousufguda, Hyderabad, TS-500045. I Lost my Agriculture property Patta Passbook bearing No. T05040350555, Khata No. 937, while travelling from Karmika Nagar to SR Nagar, Hyderabad on 20-05-2024 by bike If anybody found, please Contact: 7036711509

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మొదటి దశలోనే గుర్తిస్తే

క్యాన్సర్‌ను జయించవచ్చు..

మన్సూరాబాద్, ఫిబ్రవరి 3: ప్రపం చ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం ఎల్బీనగర్ కామినేని దవాఖాన ఆధ్వర్యంలో నాగోల్, రాక్‌టౌన్ కాలనీలోని జీడీ గోయెంకా పాఠశాల ప్రాంగణంలో 200 డ్రోన్లతో లేజర్ షో నిర్వహించా రు. డ్రోన్ షో ద్వార క్యాన్సర్‌ను త్వరగా గుర్తించడం, వెంటనే చికిత్స చేయించుకోవడం లాంటి అంశాలపై విద్యార్థుల తోపాటు వారి తల్లిదండ్రులు, కార్యక్రమానికి హాజరై ప్రజలకు అవగాహన కల్పించారు. అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించిన ఈ షోను దాదాపు 2వేల మంది వీక్షించారు. కామినేని దవాఖాన సీఈఓ గాయత్రి కామినేని, సీనియర్ సర్జికల్ ఆంకాల జిస్టులు డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ జి.అవినాష్ రెడ్డిలు కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ.. క్యాన్సర్ ఒక భయంకరమైన మహమ్మారి అనే భయాన్ని ప్రజలు వదిలేయాలని సూ చించారు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో క్యాన్సర్ బారినపడివారికి చికిత్స అందజేసి కోలుకునేలా చేయవచ్చునన్నారు. క్యాన్సర్‌పై అవగాహన లేకపోవడంతోనే ఇబ్బందులు తలెత్తడమే కాకుండా మరణాలు సంభవిస్తున్నాయన్నారు. క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించినట్లయితే వ్యాధిని నయం చేయవచ్చునని తెలిపారు.

మద్యం, ధూమపానం, పొగాకు, తదితర వాడకాలతో పాటు జన్యుపరంగా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. స్త్రీలు ముఖ్యంగా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉం దని.. బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్‌ల పట్ల మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వార క్యాన్సర్ బారి న పడకుండా ఉండవచ్చునని.. క్యాన్స ర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హర్షసూరి, డాక్టర్ ఎస్. జయం తి, డాక్టర్ ఎం.శ్రీనివాస్, డాక్టర్ పి.వెంకటసింహా, డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నం రాజు, డాక్టర్ ప్రవంత్ కమ్మట, జీడీ గోయెంకా పాఠశాల డైరెక్టర్ నివేదిత శివకుమార్, ప్రిన్సిపాల్ జగదీశ్వరి నటరాజ్, ఆపరేషనల్ హెడ్ రిషి దాస్తాని , తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి
తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962